అడ్డంకులు తొలగిపోయేనా?

- ముందుకు సాగని రహదారి విస్తరణ పనులు
- అడ్డంకిగా మారిన విద్యుత్‌శాఖ నిబంధనలు
- సామాన్యులకు, వ్యాపారులకు తప్పని పాట్లు





ఏడాదిగా రహదారి విస్తరణ పనులు నిలిచిన భద్రాచలం రోడ్, (ఇన్‌సెట్) రహదారికి ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

అశ్వారావుపేటరూరల్: గత ప్రభుత్వ హయాంలో సెంట్రల్ లైటింగ్, రహదారి విస్తరణ, మెగా డ్రెయినేజీ నిర్మాణాలకు సుమారు రూ.18 కోట్ల రూపాయాలను మంజూరు కాగా.. ఈ నిధులతో అశ్వారావుపేట–భద్రాచలం మార్గంలో 1.5 కిలోమీటర్లు, ఖమ్మం–దేవరపల్లి మార్గంలో 2 కిలోమీటర్లు ఇరువైపులా డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్, డివైడర్‌ల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ పనులను రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షిస్తుండగా, ఆయా కాంట్రాక్టర్లు ఏడాది కాలంగా చేస్తున్నారు. కాగా, గడిచిన ఏడాది కాలంగా సాగుతున్న ఈ పనులకు తొలి నుంచి అడ్డంకులే ఎదురవుతున్నాయి. ఈ అడ్డంకులతో రహదారి విస్తరణ, డ్రెయినేజీ నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. దీంతో సామాన్యులు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు.

> ‘దేవుడు వరం ఇచ్చినా పూజారి కరునించడం లేదన్న’చందంగా మారింది..అశ్వారావుపేటలో రహదారి విస్తరణ, మెగా డ్రెయినేజీ నిర్మాణాల పనులు తీరు. కొద్ది నెలలుగా సాగుతున్న అభివృద్ధి పనులకు స్థానిక విద్యుత్ శాఖ నిబంధనలు అడ్డుపడడంతో పరిస్థితి క్లిష్టంగా మారింది.

విద్యుత్ శాఖ అడ్డంకులు..

రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ నిర్మాణాల పనులు సాగుతున్న క్రమంలో రహదారికి ఇరువైపులా ఉన్న కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను అడ్డుగా ఉన్నాయి. దీంతో అడ్డుగా ఉన్న స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించే పనులు చేపట్టాలని స్థానిక విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తీసుకెళ్లారు. దాంతో తొలగించాల్సిన కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తించేందుకు రెండు శాఖల అధికారులు కలిసి ఉమ్మడి సర్వే చేపట్టారు. ఈ సర్వే లెక్కల ప్రకారం.. భద్రాచలం రోడ్‌లో కుడి వైపు 43, ఎడమ వైపు 52 కరెంట్ స్తంభాలు, ఆర్టీసీ బస్టాండ్, ట్రెండ్స్, సాయిబాబా ఆలయం, శ్రీశ్రీ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న 4 ట్రాన్స్‌ఫార్మర్లు, అలాగే ఖమ్మం–దేవరపల్లి మార్గంలో కుడి వైపు 31, ఎడమ వైపు 56 కరెంట్ స్తంభాలు, మరో మూడు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని గుర్తించారు. అడ్డుగా ఉన్న వాటిని షిఫ్టింగ్ చేసేందుకు భద్రాచలం మార్గంలో సుమారు రూ.70లక్షలు, ఖమ్మం–దేవరపల్లి మార్గంలో సుమారు రూ.84లక్షలు చొప్పున ట్రాన్స్‌కోకు చెల్లించాల్సిందిగా సూచించారు. ముందుగా ఆయా నగదులో పది శాతం ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి ట్రాన్స్‌కోకు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియ పూర్తైయితేనే అడ్డుగా ఉన్న కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను షిఫ్టింగ్ చేసే పనులను చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా, డిపాజిట్‌తోపాటు ఆయా నగదు మొత్తం చెల్లించే విధంగా నివేదిక సిద్ధం చేసి ఆర్‌అండ్‌బీ శాఖ ఈఎన్‌సీకు సమర్పించారు. కాగా, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కొంత గడువు ఉండటంతో, అప్పటి దాకా అడ్డుగా ఉన్న వాటిని తొలగించే పనులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులు కోరారు. కానీ విద్యుత్ శాఖ అధికారులు మాత్రం నగదు చెల్లింపుల ప్రక్రియ పూర్తి చేస్తేనే తొలగిస్తామని, గడిచిన రెండు నెలలుగా పెండింగ్‌లో పెట్టారు. దీంతో డ్రెయినేజీ, రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయి.

డిమాండ్ నోటీస్ ఇచ్చాం..

విస్తరణ, డ్రెయినేజీ నిర్మాణాలకు కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు అడ్డుగా ఉన్న మాట వాస్తవమే. వాటిని షిఫ్టింగ్ చేసేందుకు నిబంధనల ప్రకారం ఆర్‌అండ్‌బీ శాఖకు డిమాండ్ నోటీస్‌ను ఇప్పటికే ఇచ్చాం. ఈ నోటీస్ ప్రకారం ఆశాఖ ద్వారా విద్యుత్ శాఖకు షిఫ్టింగ్ ఖర్చుల్లో భాగంగా ముందుగా పది శాతం నగదు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ నగదు డిపాజిట్ ప్రక్రియ చేస్తే షిఫ్టింగ్ పనులు చేస్తాం.

– వెంకటరత్నం,
ఏడీఈ, ట్రాన్స్‌కో, అశ్వారావుపేట

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు ఆదివారం దాడి చేశారు. స్థానిక ఎస్సై యయాతి రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గాండ్లగూడెం గ్రామ శివారులో ఉన్న చెరువు దగ్గర పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.6,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామం వద్దగల చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచే వివిధ గ్రామాల నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, నైవేథ్యాలు సమర్పించారు. అనంతరం బంధుమిత్రులకు అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. కాగా, ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది.

ధరలను అనుసరించాలి



సమావేశంలో పాల్గొన్న ఫొటో గ్రాఫర్లు

దుమ్ముగూడెం : మండలంలోని ఫోటోగ్రాఫర్స్ ఆల్బమ్ ధరల ప్రకారం ప్రోగ్రాం చేయాలని మండలం ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేంద్రనాథ్ సూచించారు. ఆదివారం మండల ఫోటో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫోటోగ్రఫీ గౌరవ సభ్యులందరూ ఫోటో ఆల్బమ్, వీడియో ధరలను నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐడీ కార్డు లేకుండా ప్రోగ్రాం చేస్తే సదరు ఫోటోగ్రాఫర్‌కి సంఘం సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూ.5000 జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా శ్రీరామ్మూర్తి, కార్యదర్శి రవి, కోశాధికారి శ్యామల రవివర్మ, ఫొటోగ్రాఫర్లు కణితి రాజు, పవన్, పిలక నాగేశ్వరరెడ్డి, శ్రీను, జంపన్న, రమేష్, సాయి, అనిల్, బాబి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ల సమస్యలపై నిరంతర పోరాటం

చండ్రుగొండ: ప్రైవేట్ ఎల్కక్ట్రీషిన్ల సమస్యలపై ప్రభుత్వంతో నిరంతర పోరాటం చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు యండి.షరీఫ్ అన్నారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌లతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఇక్కడ ఏసీ మెకానిక్‌ల కమిటీ ఎన్నికైందని, ఆ కమిటీతో ఎలక్ట్రీషియన్ల సంఘానికి ఎలాంటి సంబంధమూ లేదని అన్నారు. విభిన్న పనులు చేసుకునే వారితో కమిటీ ఏర్పాటు చేసి, తమది ఎలక్ట్రీషియన్ల కమిటీ అని చెప్పుకోవడం సరికాదన్నారు. ఆ కమిటీతో జిల్లా సంఘానికి ఎలాంటి సంబంధాలూ లేవని స్పష్టం చేశారు. ఎలక్ట్రీషియన్ల కమిటీ మండల అధ్యక్షుడిగా దాసరి కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు. పూర్తి కమిటీని త్వరలోనే విస్తరింపజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, సతీష్, యండి.ఆసీఫ్, నాహిద్, క్రాంతి, రవి, పెద్ద చారి పాల్గొన్నారు.

ఐక్యంగా శ్రమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరురూరల్: ప్రజా సమస్యలపై ఐక్యంగా శ్రమించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మండల, పట్టణ యువజన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువకులందరూ భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ప్రజా సమస్యలపై నిత్యం పోరాడాలన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కుంటా లక్ష్మణ్, నాయకులు అక్కి నర్సింహరావు, యువజన నాయకులు బోశెట్టి రవిప్రసాద్, బి.రమేష్, గుర్రం సృజన్, హర్షనాయుడు, పవన్ నాయక్, శ్రీను పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల నివాళి

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన కూకలకుంట సుధారాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు, దొడ్డా ప్రసాద్ పాల్గొన్నారు.

అంబులెన్సు సేవలపై అవగాహన

చర్ల: సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు నూతనంగా 108 అంబులెన్సు మంజూరు కాగా అంబులెన్సు సేవలపై మారుమూల గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని కుర్నపల్లి, ఎర్రబోరు బోదనెల్లి, చింతగుప్ప, బూరుగుపాడు తదితర గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించారు. ఎటువంటి పరిస్థితుల్లో 108 అంబులెన్సుకు ఫోన్ చేయాలి, అంబులెన్సు ద్వారా ఏ విధమైన వైద్య సహాయం కల్పించబడుతుంది.. తదితర అంశాలపై గిరిజనులకు వివరించారు. ఈ కార్యక్రమంలో 108 పైలెట్ బి.మధు, ఈఎంటీ శిరోమణి తదితరులు పాల్గొన్నారు.



108 సేవలను వివరిస్తున్న ఈఎంటీ శిరోమణి

అసత్య ఆరోపణలు మానుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గుండాల: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలపై, కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న 6 గ్యారంటీలపై మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు నిరాధార వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంనర్సయ్య, నాయకులు ఎండి.అతహార్, వాసం శ్రీకాంత్, సదానంద చారిలు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులు చేయగా.. ఆ అప్పులు నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంపై భారం పడటంతో ఒక్కొక్క హామీని అమలు చేస్తూ వస్తున్నట్లు తెలిపారు. గతంలోనే బట్టుపల్లి నుంచి మామకన్ను వరకు రోడ్డు, బ్రిడ్జిలకు పాయం వెంకటేశ్వర్లు నిధులు తీసుకొస్తే.. ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్న రేగా కాంతారావు ఆ పనులను విస్మరించాడని, ప్రస్తుతం పాయం మళ్లీ ప్రణాళికలు సిద్ధం చేసి ఆ శాఖ మంత్రికి, ముఖ్యమంత్రికి అందించాడని తెలిపారు. గత బీఆర్‌ఎస్ హయాంలో నాలుగు గోడల మధ్య దళిత బంధు, బీసీ బంధు, కుట్టు మిషన్ల పంపిణీ లాంటి సంక్షేమ పథకాలను అమ్ముకున్నారని, ఎవరు ముందు డబ్బులిస్తే వారికి ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. ఇకపై పాయం, పొంగులేటిలపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో తులం ముత్తి లింగం, చిరునవ్వుల శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు వాసం శ్రీనాథ్, పుల్లోజు భరత్, గుగ్గల భాస్కర్, ఎస్‌కె.పర్వీన్, కె.సునీత ,మడత కుమారి, కోనేటి వీరభద్రా చారి, మోకల శేఖర్, భద్రం, చింత బాలకృష్ణ, బూర్గ రవి, వజ్జ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్
- ఫ్రెండ్లీ క్రికెట్ కప్ విజేత పోలీస్ జట్టు



పోలీస్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్, డీఎస్పీ రవీందర్ రెడ్డి

మణుగూరుటౌన్: నిత్యం విధుల్లో బిజీబిజీగా గడిపే పోలీస్, సింగరేణి, పాత్రికేయులు, ఆఫీసర్ల విభాగాలు ఫ్రెండ్లీ క్రికెట్ కప్‌లో పాల్గొని ఉల్లాసంగా, ఉత్సాహంగా క్రికెట్ ఆడటం సంతోషకరమైన విషయమని, ఆటల్లో గెలుపు నుంచి ఆనందాన్ని ఆస్వాదిస్తూ ఓటమి నుంచి అనుభవాన్ని నేర్చుకోవాలని ఏరియా ఇన్‌చార్జి జీఎం లక్ష్మీపతిగౌడ్ అన్నారు. ఆదివారం భద్రాద్రి స్టేడియంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జట్టు క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు.

విజేతగా పోలీస్ జట్టు..

ఫ్రెండ్లీ క్రికెట్ కప్‌లో పోలీస్, ఆఫీసర్స్, ప్రెస్, సింగరేణి జట్లు పాల్గొనగా, మొదటిగా ప్రెస్–సింగరేణి జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రెస్ జట్టు.. 12 ఓవర్లకు 51 పరుగులకు చేయగా, ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన సింగరేణి జట్టు విజయం సాధించింది. అనంతరం ఆఫీసర్స్–పోలీస్ జట్లు తలపడగా, పోలీస్ జట్టు 92 పరుగులు సాధించింది. ఆ బ్యాటింగ్ చేసిన ఆఫీసర్స్ జట్టు స్వల్ప తేడాతో ఓటమి పాలవడంతో.. ఫైనల్‌కి పోలీస్ జట్టు సింగరేణి జట్లు చేరాయి. సాయత్రం జరిగిన ఫైనల్స్‌లో పోలీసు–సింగరేణి జట్లు తలపడ్డాయి. పోలీస్ జట్టు 12 నిర్ణీత ఓవర్లకు 103 పరుగులకు 7వికెట్లు కోల్పోగా, ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన సింగరేణి జట్టు 7 వికెట్లు కోల్పోయి 86 పరుగులతో హోరాహోరీగా పోరాడి ఓటమి పాలైంది. దీంతో పోలీస్ జట్టు విజేతగా, సింగరేణి జట్టు రన్నర్‌గా నిలిచింది. ఏరియా ఇన్‌చార్జి జీఎం లక్ష్మీపతిగౌడ్, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ప్రెస్ టీం కెప్టెన్ పిండిగ వెంకట్, ఆఫీసర్స్ టీం జట్టు కెప్టెన్ తహసీల్దార్ రాఘవరెడ్డిలు పోలీస్ టీం కెప్టెన్ సీఐ సతీష్‌కుమార్, టీం సభ్యులకు, రన్నర్ టీం జట్టుకు ట్రోఫీని అందజేసి ప్రతిభ చూపిన క్రీడాకారులను బహుమతులు ఇచ్చారు. ట్రోఫీలో ప్రతిభ చూపిన గోవింద్(పోలీస్), మనోహర్(సింగరేణి టీం), సర్వర్(సింగరేణి టీం)లకు అధికారులకు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు సలగల రమేశ్, సింగు శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తొలగించండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీఓ వెంకటేశ్వరరావు

పినపాక: వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని పంచాయతీల్లో తాగునీటికి సమస్యలు రాకుండా చూడాలని ఎంపీఓ వెంకటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆదివారం మండలంలోని పంచాయతీల్లో పర్యటించిన ఆయన.. కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. వేసవికాలం నేపథ్యంలో ఏ గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంటుందో ఆరా తీశారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి వేసవికాలంలో నీటి సమస్యలు లేకుండా చూడాలని కార్యదర్శులకు సూచించారు. పంచాయతీలో బోరు బావులు, చేతి పంపులు, మిషన్ భగీరథ పైప్‌లైన్లు, వంటివి పనిచేసే విధంగా చూసుకోవాలని, ఎక్కడైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు సహకరించాలి



పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జలగం ప్రసాదరావు

దమ్మపేట: వ్యవసాయ విద్యుత్ సేవల విషయంలో స్థానిక గిరిజనులకు విద్యుత్ సిబ్బంది సహకరించి, మెరుగైన సేవలను అందించాలని మాజీ మంత్రి జలగం ప్రసాదరావు కోరారు. ఆదివారం మండలంలోని సుధాపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ ఉద్యోగి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా దమ్మపేట విద్యుత్ శాఖలో లైన్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వర్తించి, పదవీ విరమణ చేసిన చెలికాని మోహన్‌రావును శాలువాతో సన్మానించి, అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో స్థానికంగా ఉన్న గిరిజనులకు వ్యవసాయ విద్యుత్ సంబంధిత సమస్యలు ఉత్పన్నమైతే, సంబంధిత ఉద్యోగులు వెంటనే స్పందించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఎన్నో ఏళ్ల కిందట తీసుకున్న విద్యుత్ కనెక్షన్ల సర్వీసుదారుల పేరు మార్పు విషయంలో విద్యుత్ శాఖ సహకరించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కూడా పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని, మోహన్‌రావును శాలువాతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ మహేందర్, డీఈ నందయ్య, ఏడీఈ వెంకటరత్నం, ఏఈలు మహేష్, సాయికిరణ్, వెంకట్, సిబ్బంది వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, వెంకట్, రాంకుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వ్యంగ్యాస్త్రాలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చర్ల: పార్లమెంట్‌లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ, ఆమె తనయుడు రాహుల్‌గాంధీ వ్యంగ్రాస్త్రాలు సంధించడం అత్యంత దుర్మార్గమని బీజేపీ మండల అధ్యక్షుడు నూపా రమేష్ అన్నారు. బీజేపీ కౌన్సిల్ సభ్యుడు బాబా పాహీం అధ్యక్షతన ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రథమ పౌరురాలు, ఆదివాసీ బిడ్డ అయిన ద్రౌపతిముర్ము చేసిన ప్రసంగంలో పూర్ లేడీ అని సోనియాగాంధీ, బోరింగ్ స్పీచ్ అని తనయుడు రాహుల్ మాట్లాడడం ఏ మాత్రం సరైంది కాదని అన్నారు. తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ముత్తవరపు రత్తయ్య, సాధం లోకనాథం, గూనూరి రమణ, బందా మధు, శ్రీనివాసాచారి, ఇర్పా సుబ్బారావు, కుప్పా మాధవరావు, సంద్రగొండ వెంకటేశ్వారవు, బొల్లె నాగరాజు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయం 12వ వార్షికోత్సవం

పినపాక: మండలంలోని ఈ బయ్యారం గ్రామంలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయం 12వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలతో ఆలయాన్ని ప్రత్యేకంగా ఆలంకరించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్న హారతి, హోమం, అభిషేకాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ తరఫున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై విమర్శనాస్త్రాలు

స్పందించిన పలు పార్టీల నాయకులు

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

మణుగూరుటౌన్: పార్లమెంట్‌లో శనివారం ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడారు. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలు బడ్జెట్‌పై ఎంతో ఆశతో ఎదురు చూశారని, వారి ఆశలపై కేంద్ర ప్రభుత్వం నీళ్లు చల్లిందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు బడ్జెట్‌లో ఎక్కువ ప్రాధాన్యత కల్పించి, తెలంగాణ రాష్ట్రానికి మరోసారి తీరని అన్యాయం చేశారని అన్నారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగాల కల్పన విషయంలో ఉద్యోగాల భర్తీ బడ్జెట్ ప్రసంగంలో లేదని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధరపై బడ్జెట్‌లో ఆలోచన చేయలేదని, కార్పొరేట్ శక్తులకు అనుకూల బడ్జెట్ అన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలకు తూట్లు..

మణుగూరురూరల్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనానికి బీజేపీ ప్రభుత్వం మళ్లీ అన్యాయమే చేసిందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. జాతీయ పార్టీలు ఎన్నటికీ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేవని మరోమారు రుజువైందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 16 మందిని గెలిపించి పార్లమెంట్‌ను పంపించినా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తెచ్చింది శూన్యమని ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు తమ రాష్ట్రాలకు నిధులు వరద పారిస్తుంటే.. తెలంగాణ బీజేపీ ఎంపీలు, మంత్రులు నిమ్మకుండిపోవడం రాష్ట్ర ప్రజల పట్ల వారికున్న చిత్తశుద్ధిని అవగతం చేస్తోందని అన్నారు. తెలంగాణాకు నిధులు తేలేమని మంత్రులు, ఎంపీలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పేదలకు అందని ద్రాక్షలా బడ్జెట్..

మణుగూరురూరల్: పేదలకు అందని ద్రాక్షలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేంద్ర బడ్జెట్‌లో దక్కింది శూన్యమన్నారు. జిల్లాలోని పినపాక నియోజకవర్గంలో నవోదయ, సైనిక్ పాఠశాలలు, రహదారులు, భవనాలు, ఏజెన్సీ విద్యా, వైద్యం వంటి అంశాల అభివృద్ధికి నిధులు మంజూరవుతాయను కున్న ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు.

తెలంగాణకు వెన్నుపోటు..

గుండాల: తెలంగాణ అనే రాష్ట్రానికి కేంద్రం బడ్జెట్‌లో మొండిచేయి చూపిందని కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు ధార అశోక్ ఓ ప్రకటనలో అన్నారు. 8 మంది ఎంపీలులు గెలిపించిన కూడా ఒక్క ఎంపీ కూడా ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యధిక టాక్స్ కట్టే రాష్ట్రాల్లో తెలంగాణ టాప్ 10లో ఉంటుందని, కాని రాష్ట్రానికి మాత్రం ఎలాంటి ప్రత్యేక ప్యాకేజీలు కాని, నిధులు కాని కేటాయించక పోవడంపై అంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటప్పుడు సిక్కిం వంటి టాక్స్ పే చేయని రాష్ట్రాల లిస్ట్ లో తెలంగాణ పేరు చేర్చాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ఆకాంక్షలకు గండి

కరకగూడెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. నిధులు కేటాయించకపోవడం వల్ల పలు అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజా బడ్జెట్ కాదని, బీహార్ బడ్జెట్ అని,నిధుల కేటాయింపులో తగ్గుదల చేసి తెలంగాణకు అన్యాయం చేశారని విమర్శించారు.

భద్రాచలానికి కేటాయించలే..

చర్ల: కేంద్ర ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీకే పరిమితమైందని, ఇది ప్రజలకు ఏ మాత్రం ఉపయోగకరంగా లేదని టీపీసీసీ సభ్యుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లపు దుర్గాప్రసాదరావు విమర్శించారు. ఆదివారం ఆయన చర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తరువాత ప్రధాన పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటును కేంద్రం విస్మరించిందని విమర్శించారు. దక్షిణ అయోధ్యగా విరజిల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి కేంద్ర ఒక్క పైసా కూడా ఇవ్వకుండా అవమాన పరిచిందని ఆరోపించారు. విశ్రాంత ఉద్యోగుల గురించి బడ్జెట్లో ఏ మాత్రం పట్టించుకోకుండా వారిని తీవ్ర నిరాశకు గురి చేసిందని ఆయన అన్నారు.

నిరాశ పరిచిన బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న కణితి రాము

దుమ్ముగూడెం: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజలను తీవ్రంగా నిరాశ పరిచిందని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు, కో కన్వీనర్ జానీపాషాలు విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో కేంద్రబడ్జెట్‌పై పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజలను మరోమారు నిరాశకు గురిచేసే విధంగా ఉందన్నారు. విభజన సమయంలో రాష్ట్రానికి రావలసిన నిధులు సైతం ఇవ్వకపోగా ప్రాజెక్టులకు రావలసిన జాతీయ హోదాను సైతం మరిచారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, మాజీ సర్పంచ్ భూక్య చందు, నాయకులు వాగే వెంకటేశ్వరావు, దామెర్ల శ్రీనివాసరావు, బాణోత్ నగేష్, వాగే కృష్ణ, కుమ్మరికుంటా సూర్య, బిలపాటి లక్ష్మణ్ రావు, తంతరపల్లి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రమజీవులకు అందని బడ్జెట్..

దమ్మపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ శ్రమజీవులకు అందని ద్రాక్షాలానే ఉందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకుడు అమర్లపూడి రాము ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగానూ, కార్మికులు, వ్యవసాయ రంగ కూలీలకు ప్రతికూలంగానూ ఉందని విమర్శించారు.